

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రూ.లక్ష ఆర్థిక సహాయం పొందిన బీసీ కులవృత్తుల లబ్ధిదారులతో మంత్రి మల్లారెడ్డి, జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్(ఫైల్)

ఎత్తర.. గులాబీ జెండా..!

# ఇంటింటా.. సంక్షేమ సంబురం

**ఒకేసారి అమల్లోకి అన్ని పథకాలు**

- లబ్ధిదారుల మోములో వెల్లివిరుస్తున్న ఆనందం
- దరఖాస్తు చేశాం.. పథకం వస్తుందనే ఉత్సాహం
- జిల్లాలో ఎక్కడ చూసినా.. పండుగ వాతావరణం
- ఇప్పటి వరకు బీసీ కులవృత్తులకు రూ.16 కోట్లు
- మైనార్టీల ఆర్థిక సాయం రూ.5 కోట్ల 14 లక్షలు
- గృహలక్ష్మి పథకం ద్వారా రూ.60 కోట్ల ప్రొసిడింగ్స్ అందజేత
- కొనసాగుతున్న దళితబంధు లబ్ధిదారుల ఎంపిక
- బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపుతున్న పథకాలు

మేడ్చల్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేపథ్యంలో జిల్లా అంతటా సంక్షేమ పథకాల పండుగ కొనసాగుతున్నది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా బీసీ కులవృత్తులు, మైనార్టీలకు రూ.లక్ష ఆర్థిక సహాయం, గృహలక్ష్మి పథకం ద్వారా రూ.3లక్షల ప్రొసిడింగ్ పత్రాలు(ఉత్తర్వులు), దళితబంధు పథకానికి లబ్ధిదారుల ఎంపికపై కసరత్తు కొనసాగుతుండటంతో సందడి నెలకొన్నది. సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారుల సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. గతంలో ఏ ప్రభుత్వానికి సాధ్యంకాని పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం పనితీరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటికీ ఏదో ఒక రూపంలో సంక్షేమ పథకాలు అందటంతో.. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకంతో లబ్ధిపొందాం.. గులాబీ జెండా ఎత్తుతాం.. బీఆర్ఎస్ పార్టీకే మా మద్దతు తెలుపుతాం.. అంటూ ప్రకటిస్తున్నారు.

### మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో...

జిల్లాలోని మేడ్చల్, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి నియోజకవర్గాలలో ఇప్పటి వరకు బీసీ కులవృత్తులకు రూ.16 కోట్లు, మైనార్టీలకు రూ.5 కోట్ల 14 లక్షలు, గృహలక్ష్మి పథకం కింద రూ.60 కోట్లు వెచ్చించారు. దీంతో 4,114మంది లబ్ధి పొందారు. ఈ పథకాలు నిరంతర ప్రక్రియ అని., విడుతల వారీగా కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు.

### రెండవ విడత దళితబంధుకు 5500మంది

రెండవ విడత దళితబంధు పథకం లబ్ధిదారులను ఎంపిక చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఒక్కో నియోజకవర్గానికి 1100 మంది చొప్పున జిల్లా వ్యాప్తంగా 5,500 మంది లబ్ధిదారులకు దళితబంధును వర్తింపజేయనున్నారు. ఇప్పటికే దరఖాస్తుల పక్రియ పూర్తికాగా లబ్ధిదారులను ఎంపిక చేసే పనిలో అధికారులు ఉన్నారు. మొదటి విడతలో 500 మంది లబ్ధిదారులకు దళితబంధు పథకాన్ని వర్తింపజేసిన విషయం విధితమే.

### బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్

అర్హులైన వారందరికీ పథకాల వర్తింపుతో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నిండుతున్నది. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్‌పై ప్రజలకు పూర్తి విశ్వాసం ఏర్పడింది. ఇచ్చిన హామీలే కాకుండా అనేక పథకాలు అమలు చేయిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మద్దతుగా నిలుస్తామని బహిరంగంగా ప్రకటిస్తున్నారు. జిల్లాలో బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రచారం చేస్తున్న సందర్భంగా అభ్యర్థులకు మద్దతు తెలుపుతున్నారు. దీంతో బీఆర్ఎస్ శ్రేణులు ఉత్సాహంగా ప్రచారం నిర్వహిస్తూ ప్రజల మద్దతును కూడగట్టుకుంటున్నారు. అభ్యర్థుల ప్రచారానికి విశేష స్పందన లభిస్తున్నది.

# బీఆర్ఎస్ కంచుకోట సికింద్రాబాద్



డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ సమక్షంలో పార్టీలో చేరిన అడ్డగుట్టకు చెందిన వివిధ పార్టీల నాయకులు

- డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్
- బీఆర్ఎస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు

సికింద్రాబాద్, అక్టోబర్ 1: బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం పట్ల ప్రజల్లో నానాటికి ఆదరణ పెరుగుతున్నదని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ అన్నారు. ఆదివారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన బీజేపీ, ఇతర పార్టీలకు చెందిన నాయకులు బలదేవ్‌రాజ్, బాలరాజ్, శివకుమార్, నరసింహ, కుమార్, స్వామి, రాజు, బాబులతో పాటు వడ్డెర సంఘాల నేతలు దాదాపు 150 మంది డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారిని పద్మారావుగౌడ్ సాధరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తున్నారని అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కంచుకోట అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రసన్నలక్ష్మి, సామల హేమ, శైలజ, నేతలు కిశోర్ కుమార్, రామేశ్వర్, కరాటే రాజు, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

## నగరంలో వనపర్తి వాసుల ఆత్మీయ సమ్మేళనం

*హాజరైన మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి*

వనపర్తి, అక్టోబర్ 1 : వనపర్తి జిల్లాలో కృష్ణా జలాలు పరవళ్లు తొక్కినట్లే.. అభివృద్ధి కూడా పరుగులు పెడుతున్నదని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో స్థిరపడిన 2500 మంది వనపర్తి వాసులతో ఆదివారం మాదాపూర్ ప్లాటినం హైట్స్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు ఇచ్చే హామీలకు మోసపోయి వారికి ఓటేస్తే రాష్ట్రం మళ్లీ అంధకారంలోకి వెళ్లిపోవడం ఖాయమని హెచ్చరించారు. సీఎం కేసీఆర్ హయాంలో ప్రజల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని, వీటిలో కొన్ని దేశంలోనే ఆదర్శంగా నిలిచాయన్నారు. వనపర్తి విద్యారంగం పరంగా ఎంతో పురోభివృద్ధి సాధించిందని, కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు.

# టికెట్ కొనెటోళ్లు, మతపిచ్చోళ్లు మనకొద్దు..

# ప్రజా సేవ చేసేటోళ్లనే గెలిపించండి

- కాంగ్రెస్‌లో రూ.10కోట్లు ఇస్తే టికెట్ కన్ఫామ్
- టికెట్ కొన్నోళ్లు దోచుకోవమే తప్పా.. ప్రజా సేవకు పనికొస్తరా..?
- మతాన్ని అడ్డుపెట్టుకొని ప్రజల మధ్యన చిచ్చుపెట్టేందుకు బీజేపీ యత్నం
- కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇక్కడి పథకాలు ఎందుకులేవు..?
- శ్రీరామకాలనీలో అర్బన్ హెల్త్ సెంటర్, జల్‌పల్లి మున్సిపాలిటీలో 30 పడకల దవాఖాన ఏర్పాటు చేస్తాం
- ఏడాది కాలంలో మెడికల్ కాలేజీని అందుబాటులోకి తెస్తాం
- కుల సంఘాల ఆత్మీయ సమ్మేళనలో మంత్రులు హరీశ్‌రావు
- పాల్గొన్న మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎంపీ రంజిత్ రెడ్డి



కులసంఘాల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి

పహాడీషరీఫ్, అక్టోబర్ 1: కోట్లు పెట్టి టికెట్ కొనే కాంగ్రెస్ పార్టీ వాళ్లు.., మతాన్ని అడ్డుపెట్టుకొని ప్రజల మధ్యన చిచ్చుపెట్టే బీజేపీ వాళ్లు.. మనకు వద్దని.., నిత్యం ప్రజా సేవ చేసే సబితాఇంద్రారెడ్డిని గెలిపించుకోవాలని రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో దేశంలోనే నంబర్.1 స్థానంలో నిలిచిందని, ఆ ఘనత సీఎం కేసీఆర్‌దేనని చెప్పారు. ఇతర రాష్ట్రాల ప్రజలు మన రాష్ట్రంలో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు కోరుతున్నారన్నారు. ఆదివారం మంత్రి హరీశ్‌రావు రంగారెడ్డి జిల్లాలో సుడిగాలి పర్యటన చేశారు. తొలుత మహేశ్వరం నియోజకవర్గంలో పర్యటించి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో రూ.10లక్షల చొప్పున నిర్మించనున్న జల్‌పల్లి, శ్రీరామకాలనీల్లో వడ్డెర, పద్మశాలి, లింగాయత్, ఎస్సీ, ముదిరాజ్, గౌడ, కుర్మ, రెడ్డి, వైశ్య, కత్రి, నీలి, ఉప్పరి సంఘాల భవనాల నిర్మాణాలకు శ్రీరామ్ కాలనీలో శంకుస్థాపన చేశారు. అనంతరం కందుకూరులో రూ.176కోట్ల వ్యయంతో చేపట్టనున్న మెడికల్ కాలేజీ నిర్మాణ పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. అనంతరం బీఆర్ఎస్ యువ నాయకుడు కార్తీక్ రెడ్డి సభాధ్యక్షతన నిర్వహించిన వివిధ కుల సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని ప్రసంగించారు. పట్టుబట్టి సబితక్క మెడికల్ కాలేజీని సాధించారని, ఏడాది కాలంలో మెడికల్ కాలేజీని అందుబాటులోకి తెస్తామని స్పష్టం చేశారు. ఈసారి లక్షా పైచిలుకు ఓట్లతో సబితక్క గెలవడం ఖాయమన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకం నీళ్లను త్వరలోనే కందుకూరు, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో పారించి రుణం తీర్చుకుంటామన్నారు.

### జల్‌పల్లి మున్సిపాలిటీకి 30 పడకల దవాఖాన

సిద్దిపేటలో ప్రభుత్వ జూనియర్ కాలేజీకి నిధులు రూ.2 కోట్లు ఇవ్వాలని అడగగానే మంత్రి సబితాఇంద్రారెడ్డి మంజూరు చేశారని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. శ్రీరామకాలనీకి అర్బన్ హెల్త్ సెంటర్, జల్‌పల్లి మున్సిపాలిటీకి 30 పడకల దవాఖానను ఏర్పాటు చేయాలని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అడిగారని వాటిని వెంటనే సాంక్షన్ చేస్తున్నట్లు మంత్రి హరీశ్‌రావు ప్రకటించారు. అర్బన్ హెల్త్ సెంటర్‌ను త్వరలోనే మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు.

### కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నీటిగోస

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు కాంగ్రెస్ పాలనలో మూడు, నాలుగు రోజులకు ఒక్కసారి కూడా తాగునీరు వచ్చేది కాదని, ఇప్పటికీ కాంగ్రెస్, బీజేపీ పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల్లో అదే పరిస్థితి ఉందని మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ హయాంలో మిషన్ భగీరథ ద్వారా మండు వేసవిలో సైతం ఎక్కడా నీటి సమస్య లేకుండా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. దేశంలో విద్యా, వైద్యం, తాగు, సాగు నీరు, తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రమేనని అన్నారు.

### తెలంగాణ పథకాలు అక్కడ ఎందుకులేవు.?

సీఎం కేసీఆర్ ఇక్కడ స్థిరపడిన అన్ని రాష్ట్రాల ప్రజలను కడుపులో దాచుకొని తెలంగాణ బిడ్డలుగానే చూసుకుంటున్నారని, ప్రభుత్వ పథకాలు వారికీ అందజేస్తున్నారని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఇక్కడ ఆడబిడ్డల వివాహానికి రూ.లక్షలకు పైగా ఆర్థిక సాయం చేస్తున్నామని, మహారాష్ట్ర, కర్నాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీలు ఒక్క రూపాయైనా సాయం చేస్తున్నాయా..? అని ప్రశ్నించారు. రైతుబంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు రూపొందించి అమలు చేస్తున్నామని, ఇవేవి పక్క రాష్ట్రాల్లో లేవన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న వివిధ కుల సంఘాల సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు

### రూ.10 కోట్లు ఇస్తే కాంగ్రెస్‌లో టికెట్

మహేశ్వరం నియోజకవర్గంలో ఎవరెవరో పోటీ చేస్తామంటున్నారని.. రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసే వారు కాంగ్రెస్‌లో రూ.10 కోట్లు పెట్టి టికెట్లు కొనుక్కుంటున్నారని మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. మంచితనం, పనితనం లేని వారు ఎన్ని కోట్ల రూపాయలు పెడితే ఏం లాభమని విమర్శించారు. ఐదేండ్లకోసారి కోట్లు పెట్టి టికెట్ కొనేవారు మనకొద్దని, 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సేవ చేసే సబితా ఇంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.

### మినీ ఇండియా శ్రీరామకాలనీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



శ్రీరామకాలనీలో వివిధ రాష్ట్రాల ప్రజలు జీవిస్తున్నారని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఇదో మినీ ఇండియాగా వర్ణించారు. 12 కులాలకు స్థలం ఇవ్వడమంటే మాములు విషయం కాదని, సీఎం కేసీఆర్ వల్ల మాత్రమే సాధ్యమైందని తెలిపారు. దేశంలో ఉన్న వారు ఎవరైనా ఇక్కడికి వచ్చారంటే అక్కున చేర్చుకోవాలని ముఖ్యమంత్రి చెబుతుంటారని అన్నారు. మౌలిక సదుపాయాల విషయంలో గతంలో ఎలా ఉండే..? ప్రస్తుతం ఎలా ఉన్నదని ప్రజలు గమనించాలన్నారు. ప్రజలు గమనించి బీఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు.

### బీజేపీకి రాష్ట్రంలో ఒకటి, రెండు సీట్లు కూడా కష్టమే

మతాన్ని అడ్డుపెట్టుకొని ఓట్లు దండుకోవడమే బీజేపీ పార్టీకి తెలుసని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఒకటి, రెండు సీట్లు కూడా గెలవడం కష్టమేనని ఆ పార్టీ నాయకుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి స్వయంగా మీడియాకు వెల్లడించారని మంత్రి హరీశ్‌రావు అన్నారు.

### ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యం అందజేస్తున్నాం

కాంగ్రెస్ హయాంలో ప్రభుత్వ దవాఖానల్లో వైద్యులు, మందులు అందుబాటులో ఉండేవి కాదని, దీంతో ప్రభుత్వ దవాఖానలకు వెళ్లాలంటే ప్రజలు భయపడేవారని మంత్రి హరీశ్‌రావు అన్నారు. సీఎం కేసీఆర్ హయాంలో ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యం అందుతున్నదని, అనేక కొత్త దవాఖానలు ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు.

### మోదీ ఎందుకు వస్తున్నారు..?

బీజేపీ 9 ఏండ్లలో ఫైనాన్స్ కమిషన్ డబ్బులు ఇవ్వడంలేదని, వెనకబడిన జిల్లాలకు 4 సంవత్సరాలుగా ఆర్థిక సహాయం నిలిపివేసిందని మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఇప్పుడు మోదీ రాష్ట్రానికి ఎందుకు వస్తున్నారని ప్రశ్నించారు. గిరిజన యూనివర్సిటీని ఇవ్వాలని 9 ఏండ్ల కిందట పార్లమెంట్‌లో చట్టం పాసైతే ఈ రోజు వరకు ఇవ్వకుండా అన్యాయం చేశారని తెలిపారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వలేదు, కృష్ణాజలాల విషయంలో తెలంగాణ వాటా తేల్చలేదని అన్నారు.

### కుల, మతాలకు అతీతంగా సీఎం కేసీఆర్ పాలన : ఎంపీ రంజిత్‌రెడ్డి




రాష్ట్రంలో కుల, మతాలకు అతీతంగా సీఎం కేసీఆర్ పాలన కొనసాగిస్తున్నారని ఎంపీ రంజిత్ రెడ్డి అన్నారు. ట్యాంక్‌బండ్‌పై సీఎం కేసీఆర్ బసవేశ్వరుడి విగ్రహాన్ని పెట్టగానే.. కర్నాటకలో కూడా పెట్టారని లింగాయత్ సోదరులు చెప్పారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యత కల్పిస్తున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, గిడ్డంగుల చైర్‌పర్సన్ రజిని సాయిచంద్, కమిషనర్ వసంత, కో - ఆప్షన్ మెంబర్ సూరెడ్డి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు శంషోద్దీన్, కెంచె లక్ష్మీనారాయణ, పల్లపు శంకర్, భాషమ్మ, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఇక్బాల్ బిన్ ఖలీఫా, ఉపాధ్యక్షుడు యూసుఫ్ పటేల్, వర్కింగ్ ప్రెసిడెంట్ యంజాల జనార్దన్, మైనార్టీ అధ్యక్షుడు షేక్ అఫ్జల్, బీసీ సెల్ అధ్యక్షుడు నిరంజన్, యూత్ అధ్యక్షుడు అర్జున్, సోషల్ మీడియా ఇన్‌చార్జి వాసు బాబు, డీఈ వెంకన్న, ఏఈ ఆయేశా తదితరులు పాల్గొన్నారు.

## నేడు మలక్‌పేటలో ఐటీ టవర్‌కు భూమిపూజ

*హాజరుకానున్న మంత్రి కేటీఆర్*

సైదాబాద్, అక్టోబర్ 1: మలక్‌పేట ప్రభుత్వ ఉద్యోగుల గృహసముదాయంలో నిర్మిస్తున్న ఐ టెక్ న్యూక్లియస్ ఐటీ టవర్‌కు సోమవారం ఉదయం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీఎస్ఐఐసీ) తోపాటు ఇతర సంస్థల ఉమ్మడి భాగస్వామ్యంతో 44.20 ఎకరాల్లో ఐటీ టవర్‌ను నిర్మించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే తొలి విడతగా 10.35 ఎకరాల్లో రూ.1,032 కోట్ల వ్యయంతో 21అంతస్తులతో 20లక్షల చదరపు అడుగుల్లో నిర్మిస్తున్నారు. భూమి పూజా కార్యక్రమానికి మంత్రి కేటీఆర్‌తోపాటు మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ, కె.కేశవరావు, ప్రభుత్వ విప్ ఎంఎస్ ప్రభాకర్ రావు, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, టీఎస్ఐఐసీ చైర్మన్ బాలమల్లు, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, మిర్జా రియాజ్ హసన్, ఏవీఎన్ రెడ్డి, మిర్జా అహ్మద్ బేగ్, ఎమ్మెల్యేలు అహ్మద్ బలాల, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, టీఎస్ఐఏసీ ఎండీ వెంకట నర్సింహారెడ్డి, కలెక్టర్ అనుదీప్ గురిశెట్టి, అక్బర్ బాగ్ డివిజన్ కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్ తదితరులు పాల్గొననున్నారు.



ఐ టెక్ న్యూక్లియస్ ఐటీ టవర్ నమూనా

## సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం

- 3వ విడతలో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో వెయ్యి మందికి డబుల్ ఇండ్లు
- ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులు

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 1: పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం అంకిత భావంతో కృషి చేస్తున్నదని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ అన్నారు. మూడవ విడత లక్కీ డ్రాలో ఎంపికైన వెయ్యి మంది డబుల్‌బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు ఆదివారం మైలార్‌దేవ్‌పల్లిలోని ఎమ్మెల్యే నివాసానికి వచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ మూడవ విడతలో రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని వెయ్యి మందికి డబుల్ బెడ్రూం ఇండ్లు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి అవినీతికి తావులేకుండా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. తమ సొంతింటి కలను నెరవేర్చిన సీఎం కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని లబ్ధిదారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్

## కాంగ్రెస్, బీజేపీలకు గడ్డుకాలమే

*కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి*

*బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి 500 మంది బీఆర్ఎస్‌లో చేరిక*



పలు పార్టీల నేతలకు బీఆర్ఎస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి చామకూర మల్లారెడ్డి, చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

శామీర్‌పేట/ మేడ్చల్ కలెక్టరేట్, అక్టోబర్ 1: కాంగ్రెస్, బీజేపీకు గడ్డుకాలం వచ్చిందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మూడు చింతలపల్లి మండలం కొల్తూర్ గ్రామ బీజేపీ అధ్యక్షుడు అన్నబోయిన అశోక్, నాయకులు తాటికొండ మహేశ్, అన్నబోయిన రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాళ్ళ మహేశ్‌గౌడ్, గుండ్లపల్లి వెంకటేశ్‌గౌడ్, ఉడుతల ఆంజనేయులు, చెక్కల భాగయ్య, అన్నబోయిన భాస్కర్, వడ్డరి కృష్ణ, కొండ రాములు, బండి మల్లేశ్‌తో పాటు మరో వందమంది ఆదివారం బీఆర్ఎస్‌లో చేరగా వారికి మంత్రి మల్లారెడ్డి పార్టీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా నాగారం మున్సిపాలిటీ రాంపల్లి 4వ వార్డులోని శేషాద్రినగర్, శ్రీ గణేశ్ నగర్, సావిత్రినగర్, సూర్యనగర్, సంతోష్‌నగర్ తదితర కాలనీలకు చెందిన సుమారు 400 మంది వివిధ పార్టీల నేతలు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు గడ్డుకాలం వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో వంటెద్దు పోకడలు నచ్చకనే ఆయా పార్టీలను వీడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ మల్లేశ్, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, సొసైటీ డైరెక్టర్ భిక్షపతి, ఉపసర్పంచ్ అంజిరెడ్డి, వార్డు సభ్యులు సత్యనారాయణ, భూపాల్‌రెడ్డి, సుధాకర్, మురళి, సీనియర్ నాయకులు దత్తుగౌడ్, అమిరిశెట్టి శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, శేఖర్ ముదిరాజ్, అన్నబోయిన రాజు, ఆంజనేయులు, స్వామి, అబ్దుల్, రమేశ్, వెంకటేశ్‌గౌడ్, సాయిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మహేశ్‌గౌడ్, శ్రీధర్,కౌన్సిలర్లు, కో-అప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.